# అల్పాహారం ప్రారంభం

**మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో షురూ**

**పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు**

**సంతోషం వ్యక్తం చేసిన విద్యార్థులు**



## విద్యపై ఏకాగ్రత పెరుగుతుంది..

- సంగారెడ్డి కలెక్టర్ శరత్, టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 6: బడి పిల్లలకు సీఎం అల్పాహార పథకం వరమని సంగారెడ్డి కలెక్టర్ శరత్ అన్నారు. ఉదయం పూట అల్పాహారంతో శారీరక సత్తువ, మానసిక ఆరోగ్యం కలుగుతుందని పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం అల్పాహార పథకం టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1277 ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు సీఎం అల్పాహార పథకం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన పోషకాలు, ప్రోటీన్లు, విటమిన్లు ఉన్న అల్పాహారం అందిస్తారని వివరించారు. ప్రతిరోజు ఉదయం పాఠశాల ప్రారంభానికి 45 నిమిషాల ముందు అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. ఉదయం అల్పాహారం విద్యార్థుల ఎదుగుదలకు ఉపయోగపడుతుందని, తరగతి గదిలో ఏకాగ్రత మెరుగవుతుందని ఆకాంక్షించారు. ప్రతి రోజు ఉదయమే పిల్లలందరూ పాఠశాలకు వచ్చి అల్పాహారం స్వీకరించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పిల్లలకు నచ్చిన టిఫిన్లను అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరి తల్లిదండ్రులు, పాఠశాల, జిల్లా పేరు ప్రతిష్టలను పెంచాలని ఆకాంక్షించారు.



ముఖ్యమంత్రి అల్పాహారం కార్యక్రమంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ రాజర్షి షా

### సీఎం ఏమి చేసినా చరిత్ర సృష్టిస్తుంది..

– రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

సీఎం కేసీఆర్ ఏది చేసినా చరిత్ర సృష్టిస్తున్నదని చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నో గుణాత్మకమైన మార్పులు తెచ్చారని, దేశంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగుపర్చడం కోసం పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో సీఎం అల్పాహార పథకం ప్రవేశ పెట్టారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా కలెక్టర్, చింతా ప్రభాకర్ అల్పాహారం వడ్డించి, వారితో కలిసి టిఫిన్ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాత, సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, కంది ఎంపీపీ సరళ, కంది జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి లింబాజి, బీఆర్ఎస్ నాయకులు విజయేందర్‌రెడ్డి, రామప్ప, ఎంఈవో వెంకట నర్సింలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

## విద్యార్థులకు వరం..

- ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- విద్యార్థుల్లో పోషకాహార సమస్యల నివారణకు సీఎం అల్పాహార పథకం
- మెదక్ కలెక్టర్ రాజర్షి షా

మెదక్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో సీఎం కేసీఆర్ బ్రేక్ ఫాస్ట్ పథకం అట్టహాసంగా ప్రారంభమైంది. మెదక్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలకు అల్పాహారాన్ని అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్పాహార పథకం విద్యార్థులకు వరమన్నారు. సీఎం కేసీఆర్ మదిలో నుంచి పుట్టినది ఈ అల్పాహార పథకం అని తెలిపారు. దశలవారీగా ప్రతి పాఠశాలలో ఈ పథకం ప్రారంభమవుతుందన్నారు. సీఎం అల్పాహార పథకం ద్వారా మెదక్ జిల్లాలో 897 పాఠశాలల్లో 84,554 మంది మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రభుత్వ డే స్కూలు విద్యార్థులకు లబ్ధి చేకూరనున్నదని తెలిపారు. సీఎం కేసీఆర్ నిరుపేదల పక్షపాతి అని, నిరుపేదల సంక్షేమానికి ఎన్నో రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. విద్యార్థులకు సంక్షేమానికి అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, ముఖ్యంగా రైతుల కోసం ఉచిత కరెంటు, కాళేశ్వరం ప్రాజెక్టువంటి పథకాలతో రైతుల గోసలు తీర్చారని పేర్కొన్నారు. మెదక్ పట్టణంలో జిల్లా కేంద్రం ఏర్పాటు, ఎస్పీ ఆఫీసు, సీసీ రోడ్ల నిర్మాణం, మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం ఇలా అనేక సంక్షేమ పథకాలతో మెదక్ పట్టణాన్ని అభివృద్ధి పరుస్తున్నారని తెలిపారు. పట్టణంలో ప్రభుత్వ పాఠశాల, మైనార్టీ సోషల్ వెల్ఫేర్ స్కూల్స్ రెసిడెన్షియల్ స్కూల్స్, అన్ని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కింద సన్న బియ్యం పెట్టి విద్యార్థుల పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల ఆనందం విద్యార్థి ఎదిగినపుడేనని, చదువు, సంస్కారం నేర్చుకొని భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పదికి పది సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.



విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా

### పోషకాహార లోప నివారణకు అల్పాహారం..

– మెదక్ కలెక్టర్ రాజర్షి షా

ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువగా నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతారని, వారిలో పోషకాహార లోపాలను నివారించేందుకు సీఎం కేసీఆర్ అల్పాహార పథకం మెదక్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రభుత్వం చేపట్టిన మంచి పథకాలు దేశంలోనే లేవన్నారు. సీఎం అల్పాహార పథకం ప్రారంభించడానికి సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీతో అధ్యయనం చేయించి, ప్రారంభించారని తెలిపారు. గత అకాడమీ ప్రారంభంలో ఇంగ్లిష్ మీడియం ప్రారంభించుకున్నామని, మనఊరు–మనబడి కార్యక్రమాల బాధ్యత ప్రధానోపాధ్యాయులదేన్నారు. అనంతరం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా, అధికారులు, ప్రతినిధులు విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ బట్టి జగపతి, ఎంఈవో నీలకంఠం, మార్కెటింగ్ చైర్మన్ విజయపాల్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సీడీపీవో స్వరూప, సహాయ సీడీపీవో వెంకటరమణ, వైద్య శ్రీనివాస్ శర్మ, పట్టణ కౌన్సిలర్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, వంజరి జయరాజ్, బీఆర్ఎస్ నాయకులు రాగి అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి అల్పాహారంతో విద్యార్థినులు



విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటున్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా

# 'కులవృత్తుల తలరాతలు మారనున్నాయి'

నర్సాపూర్, అక్టోబర్ 6: సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన కులవృత్తులకు లక్ష ఆర్థిక సాయం వారి తలరాతలను మారుస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని సాయికృష్ణ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాజర్షి షా, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రమేశ్‌తో కలిసి ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలోని 468 లబ్ధిదారులకు బీసీబంధు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలనేదే సీఎం కేసీఆర్ ఆలోచనని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు తర్వాత ఎలాంటి అభివృద్ధి జరిగిందో ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. కులవృత్తులను గౌరవించుకునేలా వారికి రూ. లక్ష చొప్పున అందజేసి సీఎం కేసీఆర్ వారి ఉపాధికి బాసటగా నిలిచాడని వెల్లడించారు. బీసీబంధు రానివారు అసంతృప్తి చెందవద్దని, విడతల వారీగా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రమేశ్

### కులవృత్తులను ఆదుకోడానికి బీసీబంధు

– రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి

రాష్ట్రంలోని కులవృత్తులను ఆర్థికంగా ఆదుకోడానికి సీఎం కేసీఆర్ బీసీబంధు పథకాన్ని తీసుకువచ్చారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి వెల్లడించారు. 14 కులాలకు నేడు బీసీబంధు చెక్కులు అందజేసి వారి ఆర్థిక స్థోమతని అధిగమించేలా చేశాడన్నారు. కులవృత్తులను గౌరవించింది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గతంలో ఏ ప్రభుత్వం వారిని ఆదుకోలేదని గుర్తుచేశారు. అలాగే, 25 వేల ప్రభుత్వ పాఠశాలలో 2.70 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ పథకానికి శ్రీకారం చుట్టారని వెల్లడించారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన బీసీబంధు పథకం అద్భుతమైనదన్నారు. ఈ అవకాశాన్ని కులవృత్తులు సద్వినియోగపరుచుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కో–ఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైడి శ్రీధర్‌గుప్తా, శివంపేట్ జడ్పీటీసీ పబ్బ మహేశ్, ఆత్మకమిటీ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్‌రాంరెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, వివిధ మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ మండలాధ్యక్షులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.